నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం

**నమ్మలేని నిజాలు**

ఖాళీ ఖజాన
నీళ్లు లేని ఓ నుయ్యి
తీరని దాహం

క్షుద్ర జగత్తు
ఓ పెద్ద మూఢ ఊబి
జారి పడకు.

పాప పుణ్యాలు
సమూహం తూచె రాళ్లు
శ్మశాన శయ్య.

లెక్కల పత్రం
చూడగ మేడిపండు
మార్కులు సున్న.

పరి వర్తన
నూతన బీజ జ్ఞానం
నాగరికత



- రేడియమ్
సెల్: 9291527757

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com    ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433    E-mail : netinijam93@gmail.com

ఇరువది నాలుగవయేట
తెచ్చున కాంతి సంక్రాంతి ?
సగటు మనిషి మనసుల్లో
వచ్చున గొప్ప విక్రాంతి ?

గాలిపటం రంగవల్లి
గడిచె కనుమ సరదా !
ఇకనైనా ఎత్తేసున
మంచు పొగల పరదా !

**శ్రీనిజాలు**



- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

హైదరాబాద్    గురువారం 18-1-2024    NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026    సంపుటి :30    సంచిక:130    పేజీలు:6    వెల: రూ.1/-

## అయోధ్య రామాలయ విగ్రహ ప్రతిష్ఠపై అలహాబాద్ హైకోర్టులో సంచలన పిటిషన్..!

హైదరాబాద్, జనవరి 17: అయోధ్య రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని నిలిపివేయాలంటూ అలహాబాద్ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌కు చెందిన భోలా దాస్ అనే వ్యక్తి ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమానికి సంబంధించి శంకరాచార్య లేవనెత్తిన అభ్యంతరాలను పేర్కొంటూ పిటిషన్‌లో ప్రస్తావించారు. కార్యక్రమం సనాతన సంప్రదాయానికి విరుద్ధమని పేర్కొన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని బీజేపీ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ఆలయ ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేస్తుందని దుయ్యబట్టారు.

ఈ పిటిషన్‌పై వెంటనే విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ నెల 22న అయోధ్యలో విగ్రహ ప్రతిష్ఠాపన జరుగనున్న విషయాన్ని కోర్టు ఎదుట పిటిషన్‌లో ప్రస్తావించారు. ప్రధాని నరేంద్ర మోదీ విగ్రహ ప్రతిష్ఠాపన చేయనున్నారని.. యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ సైతం పాల్గొంటున్న విషయాన్ని పిటిషనర్ తెలిపారు. కార్యక్రమం ఎందుకు నిర్వహించకూడదో పిటిషన్‌లో ప్రస్తావించారు. ప్రాణ ప్రతిష్ఠపై శంకరాచార్యులు అభ్యంతరం తెలిపారని, అలాగే ఆలయం ఇంకా నిర్మాణ దశలోనే ఉందని తెలిపారు. అసంపూర్తిగా ఉన్న ఆలయంలో ఎలాంటి దేవతా విగ్రహాన్ని ప్రతిష్ఠించకూడదన్నారు.

అలాగే ప్రస్తుతం పుష్యమాసం నడుస్తుందని.. ఈ మాసంలో ఎలాంటి మతపరమైన కార్యక్రమాలు జరుగవని పేర్కొన్నారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో రాజకీయ ప్రయోజనం కోసం భారతీయ జనతా పార్టీ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని ఆయన పిటిషన్‌లో ఆరోపించారు. పిటిషనర్ న్యాయవాది అనిల్ కుమార్ బింద్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొంటున్న కార్యక్రమాన్ని నిలిపివేయాలని పిల్ దాఖలు చేసినట్లు పేర్కొన్నారు. హైకోర్టులో త్వరగా పిటిషన్ విచారణకు స్వీకరించేలా చూస్తామన్నారు.

మరోవైపు, జనవరి 22న భజన, కీర్తనలు నిర్వహించాలని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వులను సవాలు చేస్తూ దాఖలైన పిల్‌ను విచారించేందుకు అలహాబాద్ హైకోర్టు నిరాకరించింది. ఈ ఏడాది యుూపీలోని అన్ని దేవాలయాల్లో భజన–కీర్తనలు నిర్వహించాలని, రామచరిత్ మానస్ పఠించాలని, అన్ని నగరాల్లో రథ, కలశ యాత్ర చేపట్టాలని ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది.

## మోదీ చేస్తున్నది రాజకీయం కాదు, అది ధర్మనీతి

### -శ్రీరామ జన్మభూమి ఆలయ ప్రధాన అర్చకుడు ఆచార్య సత్యేంద్ర దాస్

లక్నో జనవరి 17 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ):ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య లో కొత్తగా నిర్మించిన రామ మందిరం ప్రారంభోత్సవంపై రాజకీయ వివాదం నెలకొన్న విషయం తెలిసిందే. మత పరమైన అంశాన్ని రాజకీయం చేస్తున్నారంటూ బీజేపీ, ప్రధాని మోదీపై విపక్షాలు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు. ప్రతిపక్ష నేతల విమర్శలపై శ్రీరామ జన్మభూమి ఆలయ ప్రధాన అర్చకుడు ఆచార్య సత్యేంద్ర దాస్ స్పందించారు. మోదీ చేస్తున్నది రాజకీయం (రాజనీతి) కాదని, అది ధర్మనీతి (ధర్మ మార్గం) అని అన్నారు. 'రాజనీతి కాదు.. ధర్మనీతి. కొందరు ప్రధాని మోదీ గురించి చులకనగా మాట్లాడుతున్నారు. దానికి బీజేపీ సమాధానం చెబుతుంది. అయినా నేను ధర్మనీతికి చెందిన వాడిని. నేను చేయాల్సిందల్లా రామభక్తులకు సేవ చేయడమే. నేను ఓ పూజారిని. నాకు రాజకీయాలతో సంబంధం లేదు' అంటూ వ్యాఖ్యానించారు. ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో కొత్తగా నిర్మించిన రామ మందిరం) ప్రారంభోత్సవం ఈనెల 22న జరగనున్న విషయం తెలిసిందే.

## అదానీ ఛైర్మన్ గౌతం అదానీ, టాటా ఛైర్మన్ చంద్రశేఖరన్ లతో రేవంత్ భేటీ..



హైదరాబాద్, జనవరి 17:స్విటర్లాండ్‌లోని దావోస్‌లో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి మూడోరోజు పర్యటన కొనసాగుతోంది. 'ప్రపంచ ఆర్థిక వేదిక' సదస్సులో పాల్గొనేందుకు వెళ్లిన సీఎం.. బుధవారం పలువురు పారిశ్రామికవేత్తలతో భేటీ అయ్యారు. అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతం అదానీ, టాటాసన్స్ ఛైర్మన్ చంద్రశేఖరన్ లతో ఆయన సమావేశమయ్యారు. తెలంగాణలో పెట్టుబడి అవకాశాలను వారికి వివరించారు..

ఇప్పటికే అదానీ, టాటా సంస్థలు హైదరాబాద్ లో విస్తృతంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని రేవంత్ వారికి గుర్తు చేశారు.. వాటికి అనుబంధంగా మరిన్ని సంస్థలను తమ రాష్ట్రంలోనూ ఏర్పాటు చేయాలని వారిని కోరారు.. అందుకు వారి నుంచి సానుకూల స్పందన వచ్చినట్లు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ వెల్లడించారు.. కాగా నేడు జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ ఛైర్మన్ సజ్జన్ జిందాల్, గ్లోబల్ హెల్త్ స్ట్రాటజీ వైస్ ప్రెసిడెంట్ విలియం వార్, వీఆర్‌ఎల్‌డీసీ ప్రతినిధులను కలిశారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను సీఎం వారికి వివరించారు. ఐటి రంగంలో హైదరాబాద్ అగ్రగామిగా దూసుకుపోతున్న విషయాన్ని రేవంత్ ఈ ప్రతినిధులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేసి చూపారు..

## గట్టమ్మ తల్లిని దర్శించుకున్న మంత్రులు కొండా సురేఖ, సీతక్క..



ములుగు , జనవరి 17: (నేటినిజం ప్రతినిధి): ములుగు జిల్లా సమీపంలో ఉన్న గట్టమ్మ తల్లిని బుధవారం రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖా మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర పంచాయతీ రాజ్ మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క దర్శించుకున్నారు. ములుగు జిల్లాకు మొదటిసారిగా వచ్చిన మంత్రి సురేఖ కు పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి సంస్థ డ మహిళ శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి సీతక్క జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి స్వాగతం పలికారు.మేడారం మహా జాతరలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని తల్లిని కోరుకున్నారు. మొదటి సారి మంత్రి హోదాలో ములుగు జిల్లాకు రావడం గట్టమ్మ తల్లిని దర్శించుకోవడం సంతోషంగా ఉందని మంత్రి కొండా సురేఖ అన్నారు. వారితో పాటు జిల్లా ఎస్ పి శబరిష్, డి ఎఫ్ ఓ రాహుల్ కిషన్ జాదవ్, ఆర్ డి ఓ సత్య పాల్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

## వేసవిలో తాగునీటి సమస్య లేకుండా చూడాలి : మంత్రి జూపల్లి కృష్ణారావు





వనపర్తి, జనవరి 17: సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలో కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన కొనసాగిస్తున్నారని ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. బుధవారం వనపర్తి జిల్లా సమీ కృత కలెక్టరేట్ సముదాయంలో జిల్లా అధికార యంత్రాంగంతో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల సమస్యలను పరిష్కారించే విధానంలో స్పష్టమైన మార్పు కనబడాలన్నారు.

సమస్యలు పరిష్కరించి ప్రజలకు న్యాయం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. మనం ప్రజా సేవకులం మాత్రమే అని గుర్తించాలన్నారు. సమస్యలు విన్నవించుకోవడానికి వచ్చిన ప్రజలతో మర్యాదగా మసలుకోవాలని హితవు పలికారు. అంతిమంగా ప్రజల చేత శభాష్ అనిపించుకునేలా అధికారులు పని తీరు ఉండాలని చెప్పారు. వేసవి కాలంలో తాగునీటి ఇబ్బందులు లేకుండా ఇప్పటినుంచే ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు సాగాలని అధికారులను ఆదేశించారు.

## సురేష్ గోపి కుమార్తె వివాహం .. నూతన జంటకు మోడీ ఆశీర్వాదం..

న్యూఢిల్లీ, జనవరి 17:జనవరి 17 ప్రముఖ మలయాళ నటుడు సురేశ్ గోపీ కుమార్తె వివాహానికి ప్రధాని నరేంద్ర మోడీ హాజరయ్యారు. సురేశ్ గోపీ పెద్ద కుమార్తె భాగ్య సురేశ్ వివాహం గురువాయుర్ ఆలయంలో బుధవారం జరిగింది. కేరళ పర్యటనలో ఉన్న మోడీ కోచ్చిలో రోడ్డు షో నిర్వహించిన అనంతరం నేరుగా ఆలయానికి వచ్చి, వధూవరులను ఆశీర్వదించారు. కొత్త దంపతులకు స్వయంగా మోడీ వరమాలలు అందించారు. అదే ఆలయంలో వివాహం జరుపుకుంటున్న మరో 30 జంటలకు కూడా మోదీ ఆశీర్వచనాలు అంద జేశారు. ప్రముఖ నటుడు మోహన్ లాల్ తోపాటు మలయాళ పరిశ్రమకు చెందిన పలువురు నటీనటులు కూడా సురేశ్ గోపీ కుమార్తె వివాహానికి హాజరై నూతన జంటను ఆశీర్వదించారు..

కాగా, మోడీ గురువాయిర్ లో స్వామివారిని దర్శించుకున్నారు.. ఆలయానికి చేరుకున్న ప్రధానికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు వేద పండితులు.. దర్శనానంతరం తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందజేశారు..

## చీపురు పట్టి.. అమ్మవారి ఆలయాన్ని క్లీన్ చేసిన కిషన్ రెడ్డి..

హైదరాబాద్, జనవరి 17:హైదరాబాద్ లోని బషీర్ బాగ్ అమ్మవారి ఆలయంలో స్వచ్ఛత కార్యక్రమంలో కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్ రెడ్డి పాల్గొన్నారు. ఇవాళ ఉదయం ఈ కార్యక్రమం నిర్వహించారు. అయోధ్యలో రామమందిర ప్రారంభోత్సవం సందర్భంగా ఆలయాలు, పుణ్యక్షేత్రాలలో స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహించాలని ప్రధాని మోడీ ఇచ్చిన పిలుపు మేరకు బషీర్ బాగ్ అమ్మవారి ఆలయంలో కిషన్ రెడ్డి ఆలయాల స్వచ్ఛత కార్యక్రమం చేపట్టారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెల 22న అయోధ్యలో శ్రీరాముడి విగ్రహానికి ప్రాణ ప్రతిష్ట జరగబోతోందని వెల్లడించారు. హిందువుల 500ఏళ్ల ఆకాంక్ష నెరవేరబోతోందని పేర్కొన్నారు. ప్రాణ ప్రతిష్ట కార్యక్రమం కోసం దేశంలోని కోట్ల మంది హిందువులు వేయి కన్నులతో ఎదరుచూస్తున్నారని తెలిపారు. అదేవిధంగా దేశంలోని ప్రజలంతా స్వచ్ఛ అభియాన్ కార్యక్రమంలో పాల్గొని పుణ్యక్షేత్రాలను శుభ్రం చేయాలంటూ ప్రధాని మోడీ పిలుపునిచ్చారని గుర్తు చేశారు. కులమతాలు, వర్గాలకు అతీతంగా.. స్వచ్ఛ అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు.

## లోక్ సభ ఎన్నికలలో బీఆర్ఎస్ కే ఎందుకు ఓటేయ్యాలంటే?..

హైదరాబాద్, జనవరి 17:రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కేసీఆర్‌కే ఎందుకు ఓటేయ్యాలో కేటీఆర్ వివరించారు. తెలంగాణ ప్రజల స్వరాన్ని పార్లమెంట్‌లో గట్టిగా, స్పష్టంగా వినిపించేది కేవలం బీఆర్ఎస్ పార్టీ మాత్రమేనని స్పష్టం చేశారు. దానికి ఉదాహరణ.. 16, 17వ లోక్‌సభలో బీఆర్ఎస్ ఎంపీలు తెలంగాణ హక్కులు, ప్రయోనాల కోసం కేంద్రాన్ని నిలదీసిన సందర్భాన్ని గుర్తు చేశారు. తెలంగాణ హక్కులు, ప్రయోజనాల కోసం పార్లమెంట్‌లో బీఆర్ఎస్ ఎంపీలు కేంద్రాన్ని ఎన్నిసార్లు ప్రశ్నించారో అనే వివరాలను గణాంకాలతో సహా వివరించారు

కేటీఆర్. 16, 17వ లోక్‌సభలో బీఆర్ఎస్ ఎంపీలు కేంద్రాన్ని 4,754 సార్లు ప్రశ్నించగా, కాంగ్రెస్ 1271 సార్లు, బీజేపీ కేవలం 190 సార్లు మాత్రమే ప్రశ్నించినట్లు గణాంకాలు చెబుతున్నాయి. 2014లో రాష్ట్రం సాధించినప్పుడు తెలంగాణకు ఉన్న ఏకైక గొంతుక టీఆర్ఎస్ మాత్రమే అని కేటీఆర్ చెప్పారు. 2024లో కూడా తెలంగాణకున్న ఏకైక గొంతుక మన పార్టీ మాత్రమే అని స్పష్టం చేశారు. నాడు .. నేడు.. ఏనాడైనా.. తెలంగాణ గళం.. తెలంగాణ బలం తెలంగాణ దళం.. మనమే.. అని కేటీఆర్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు.

## కలెక్టరేట్ ఎదుట మహిళ ఆత్మహత్యాయత్నం..

కరీంనగర్, డిసెంబర్ 27:కలెక్టరేట్ ఎదుట ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన కరీంనగర్ లో చోటుచేసుకుంది. పురపాటి సంపత్ భార్య పురపాటి గీత తన వెంట తెచ్చుకున్న పెట్రోల్ బాటిల్ తో పెట్రోల్ మీద పోసుకొని కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా.. బ్లూ కోర్ట్ పోలీసులు అడ్డుకొని పెట్రోల్ బాటిల్ లాక్కున్నారు.

తన భర్త సంపత్ పై ఎంపీపీ వేధింపులు భరించలేకనే ఆత్మహత్య చేసుకుందామని అనుకున్నామని తెలిపారు. కరీంనగర్ విజేత ఆసుపత్రిలో చావు బతుకుల మధ్యలో కొట్టుమిట్టాడుతున్న తమకు న్యాయం చేయాలని మహిళ నిరసన వ్యక్తం చేస్తోంది.

## బాణాసంచా కర్మాగారంలో భారీ పేలుడు..

# 20 మంది మృతి

న్యూఢిల్లీ, జనవరి 17: థాయ్‌లాండ్ లో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. సెంట్రల్ సుఫాన్ బురి ప్రావిన్స్ లో గల సాలా ఖావో టౌన్‌షిప్ సమీపంలోని ఓ బాణాసంచా కర్మాగారంలో భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో సుమారు 20 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. బుధవారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో ఈ ఘటన చోటు చేసుకుంది.

పేలుడు సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు.

ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉండటంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. అయితే, ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదని చెప్పారు. ఈ మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

నేటి కందం- నేటికి అందం

వాచస్పతిగా నొప్పెడి
ధీచతురుండగు రవికవి తిన్నగ కలిసెన్
చాచగ తన హస్తము-గాం
ధీచంద్రునికై సబర్మతీ వాటికలోన్
(18-1-1930 రవీంద్రనాథ్ టాగోర్ సబర్మతీ ఆశ్రమంలో గాంధీజీని కలిసిన రోజు)



-రాధశ్రీ
సెల్:9494481210

## కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చే ఉద్దేశం బీఆర్ఎస్‌కు లేదు : వినోద్ కుమార్





రాజన్న సిరిసిల్ల, జనవరి 17:(నేటినిజం ప్రతినిధి): కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చే ఆలోచన బీఆర్ఎస్ పార్టీకి లేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వంద రోజుల్లో అమలు చేయకుంటే ప్రజలే ప్రభుత్వాన్ని కూల్చుతారని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కాంగ్రెస్ ప్రభుత్వం కూలబోతుంది అని హెచ్చరిక చేయడం, కాంగ్రెస్, బీజేపీ పార్టీలు కలిసి పని చేద్దాం అని మాట్లాడడం విచిత్రంగా ఉందని పేర్కొన్నారు.

జిల్లాలోని ఇల్లంతకుంట మండల కేంద్రంలో బుధవారం ఎంపీటీసీ ఒగ్గు నర్సయ్య ఇంట్లో మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌తో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. బండి సంజయ్ నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని, కాంగ్రెన్ ప్రభుత్వాన్ని కూల్చే ఆలోచన బీఆర్ఎస్ కు లేదని స్పష్టం చేశారు.

39 మంది ఎమ్మెల్యేలు, శాసనమండలిలో మెజారిటీ సభ్యులతో బీఆర్ఎస్ బలమైన ప్రతిపక్షంగా ఉందని పేర్కొన్నారు.

బీఆర్ఎస్ ప్రజా సమస్యలపై పోరాటం చేస్తోందని చెప్పారు. అనవసరంగా బీఆర్ఎస్ పార్టీపై బండి సంజయ్ చేస్తున్న ఆరోపణలు సరికాదని..బండి సంజయ్ నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని హితవు పలికారు. కేసీఆర్ ప్రభుత్వం పదేళ్లు ప్రజల ఆశీర్వాదంతో ఎన్నో గొప్ప పనులు చేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు నెరవేర్చకుంటే ప్రతిపక్ష పార్టీగా బీఆర్ఎస్ పోరాటం తప్పకుండా చేస్తోందన్నారు.

## నల్లగొండను మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతా : మంత్రి కోమటిరెడ్డి



నల్గొండ ,జనవరి 17: నల్లగొండను మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతానని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. బుధవారం నల్లగొండలో మున్సిపల్ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయంలో కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. నల్లగొండ నలు వైపులా ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ నిరుపేదల సొంతింటి కలను నిజం చేస్తామన్నారు. 6 గ్యారంటీలను 100 శాతం అమలు చేస్తామని స్పష్టం చేశారు. క్యాబినెట్‌లో కల్యాణలక్ష్మి, షాదీముబారక్, ఆర్థిక సహాయంతో పాటు తులం బంగారం పై నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. మంత్రి వెంట కలెక్టర్ హరి చందన దాసరి, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జె.శ్రీనివాస్,మున్సిపల్ కమిషనర్ కందుకూరి వెంకటేశ్వర్లు, పబ్లిక్ హెల్త్ ఈఈ సత్యనారాయణ, ఆర్డీవో రవి, తదితరులు పాల్గొన్నారు.

## అద్దంకి దయాకర్‌కు హ్యాండిచ్చిన కాంగ్రెస్.. ఎమ్మెల్సీ ఉప ఎన్నికలకు అభ్యర్థులను ఖరారు చేసిన ఏఐసీసీ..

హైదరాబాద్, జనవరి 17:తెలంగాణలో జరుగనున్న రెండు శాసనమండలి ఉప ఎన్నికల కోసం కాంగ్రెస్ అధిష్ఠానం అభ్యర్థులను ఖరారు చేసింది. మహేశ్‌కుమార్ గౌడ్, బల్మూరి వెంకట్‌ను అభ్యర్థులుగా ప్రకటించింది. ఈ మేరకు ప్రకటన విడుదల చేసింది. ఉప ఎన్నికల కోసం బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్, బల్మూరి వెంకట్ అభ్యర్థిత్వాన్ని అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఖరారు చేసినట్లు ఆ పార్టీ జనరల్ సెక్రెటరీ కేసీ వేణుగోపాల్ వెల్లడించారు. అయితే, ఎమ్మెల్సీ ఎన్నికల కోసం బల్మూరి వెంకట్, అద్దంకి దయాకర్‌కు టికెట్లు ఖరారైనట్లు ప్రచారం జరిగింది. పార్టీ సీనియర్ నేత అద్దంకి దయాకర్‌కు టికెట్ ఇవ్వకుండా ఆయన స్థానంలో మహేశ్‌కుమార్ గౌడ్‌కు అధిష్ఠానం టికెట్ ఖరారు చేసింది.

ప్రస్తుతం అద్దంకి దయాకర్ కాంగ్రెస్ అధికార ప్రతినిధిగా కొనసాగుతున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో తుంగతుర్తి టికెట్ ఆశించారు. చివరకు ఆయనకు టికెట్ ఇవ్వలేదు.

ఆయన స్థానంలో మరొకరికి టికెట్ ఇచ్చిన కాంగ్రెస్ అధిష్ఠానం.. అద్దంకికి తగిన న్యాయం చేస్తామని భరోసా ఇచ్చింది.

తాజాగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆయనకు టికెట్ ఖరారైందని విపరీతంగా ప్రచారం జరిగింది. ఉప ఎన్నికల్లోనూ మరోసారి మొండి చేయి చూపింది. ఇదిలా ఉండగా.. నామినేషన్ల గడువు గురువారంతో ముగియనున్నది. 29న రెండు స్థానాలకు పోలింగ్ జరుగను న్నది. ఆ తర్వాత కౌంటింగ్ నిర్వహించి.. విజేతలను ప్రకటించనున్నారు. కొత్తగా ఎన్నికయ్యే ఎమ్మెల్సీల పదవీకాలం 2027 నవంబర్ వరకు ఉండనున్నది.

నేటి నిజం
# సాహితీ కెరటాలు
website:www.netinijam.com
website: www.netinijam.com
2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 గురువారం 18-1-2024



నానీ

కరువుకి
నేలమ్మ గుండె పగిలింది
పగుళ్ళనిండా
రాలిన ఆశలు.



-డా|| సి. భవానీదేవి
9866847000

ఘంటారావం

నాలుకను
నియంత్రించు
నలుగురిని
నడిపించు.

మెట్లమీదికెక్కానని
మురిసిపోకు
మింగే పాములుంటాయని
మరువకు.

చిన్న సమస్యనే
అనుకోకు
చిల్లుపడ్డ కుండను
మరువకు.

దేహబలం
ఇతరుల్ని జయిస్తుంది
మనోబలం
ఇంద్రియాల్ని జయిస్తుంది.



-ఘంటా మనోహర్‌రెడ్డి
సెల్:9949992964

## కులకశ్పి
కథ

కథల వంతెన



-డా||నందిని సిధారెడ్డి
సెల్:9440381148



**రాజిరెడ్డికి మెలకువొచ్చేసరికి రేకుడబ్బా మీద రాయితో కొడుతున్నట్టు ఒకటే చప్పుడు వినబడుతోంది. అసలా చప్పుడు వినే అతనికి మెలకువొచ్చినట్లుంది. తెల్లవారుతున్నదని వెంటనే తెలిసిపోయింది.** ఇంతకుముందైతే ఆ ఊళ్లో జనం కోడి కూస్తూనే హడావిడి పడుతూ నిద్రలేచి, నిద్రించేవాళ్లం లేపి పనులకు సిద్ధమయే వాళ్లు. ఇప్పుడు ఊళ్లో దేశవాళీ కోళ్లు ఒకటీ ఆరా తప్ప దాదాపు అంతర్ధానమైపోవటం వల్ల ఆ కూతలే వినిపించటం లేదు. ఫారం కోళ్లకు రాత్రీపగలూ ఒక్కలాగే ఉంటాయి కనుక కూసే అలవాటు లేనేలేదు.

రాజిరెడ్డికి ఆ చప్పుడు పాలసెంటర్ దగ్గర క్యాన్ చప్పుడని తెలిసిపోయింది. అట్లా పాలక్యాన్‌ను గంటలా మోగించారంటే నాలుగున్నరయిందని లెక్క. వాళ్లమ్మ అప్పటికే నిద్ర లేచి పాలు పిండుతున్నట్లున్నది. చెంబులో పాలధార చప్పుడు సన్నగా లయబద్ధంగా వినిపిస్తోంది. రాజిరెడ్డికి ఆ తర్వాత చాలాసేపు నిద్రపట్టలేదు. ఉద్యోగం వొచ్చినప్పట్నుంచి ఊరితో పూర్తిగా సంబంధాలు తెగలేదు గానీ, చిన్నప్పటికీ ఇప్పటికీ ఊరి జీవితమెట్లా మారిపోయిందో కొట్టొచ్చినట్టు కనబడుతున్నది.

"వడ్లోల్ల పిలగాడు చాన్రోజుల తర్వాత పొద్దుగాల్నే దాతిపెట్టిన ట్టుండ్రు". రాజిరెడ్డి తండ్రి ఇటుపక్కకు బొర్లుతూ అన్నాడు.

రాజిరెడ్డి చెవి ఇంటెనుక వైపు పెట్టాడు. దాతి మీద బాడిసెతో ఏదో చెక్కుతున్నట్టు చప్పుడవుతున్నది. నారాయణ గుర్తొచ్చాడు. ఏడో తరగతి వరకు తన క్లాస్‌మేట్. తనిష్టపడే బాల్యమిత్రుడు. కలిసి ఎన్నో ఆటలు ఆడుకున్నారు. ఆ ఊళ్లో ఉన్నంతవరకు నారాయణ ఏడో క్లాస్ చదివాడు. పక్కూరికి పంపించి చదివించటానికి వాళ్ల నాయన ఒప్పుకోలేదు. పని ఒత్తిడివల్ల, బతుకు భారం వల్ల వడ్రంగి వృత్తిలోకి దిగక తప్పింది కాదు నారాయణకు.

నారాయణను చూడక యాడాదయినట్లుంది రాజిరెడ్డికి. పలకరిద్దామనిపించింది. తలుపు తీసుకుని బయటపడాడు. మబ్బుపట్టి ఒకటొకటీ చినుకు రాలుతోంది. తెల్లారినా మసకచీకటిగానే ఉందింకా. బనీను మీదున్న నారాయణ బాడిసెపట్టి నాగటిదుంప చెక్కుతున్నాడు. చెక్కుతూ ఛాతీ విరిచీ ఊతగా శబ్దం చేస్తున్నాడు. పోశయ్య కొప్పెర పెట్టుకోని పాలె పనికొస్తుందో లేదో చూస్తున్నాడు.

రాజిరెడ్డి దాతి దగ్గర కెళుతూ. "ఏం నారాయణా, పని జోరుగా సాగుతున్న ట్లుంది" అని పలకరించాడు.

నారాయణ చిన్నగా నవి, "ఇది, ఇదో పనా," అని ఆగి మళ్లీ చెక్కటంలో పడిపోయాడు.

"ఎపుడొచ్చిండూ పటేల్.." పోశయ్యడి గాడు.

"రాత్రొచ్చిన"

కుశల ప్రశ్నలవుతున్నంతసేపు నారాయణ పనిచేస్తూనే ఉన్నాడు. దుంప సరిచేసి పాలె దిగ్గొట్టి నాగలి అమర్చి పోశయ్యను పంపించేశాడు.

"నారాయణా.. ఎట్లుంది పని?"

"ఏం లాభం లేదు రెడ్డీ..పని జెత్తామన్నా పని లేకుంటయి పోయింది. నా బతుకు దండుగయిపోయింది. నీ లెక్క సదువుకుంటెంత మంచిగుండేది. మా నాయిన సదువు బందు జేసెదాక ఒకటే పట్టుపట్టె.."

"ఇప్పుడెమయింది నారాయణా.. అప్పుడే అంతయిపోయినట్టు మాట్లాడుతున్నవు?" గొగ్గాల్ల మీద కూచున్న నారాయణ పంచె అటు ఇటు సర్దుకుని చెక్కమీద కూచున్నాడు.

"కులకశపి.. కులకశపి (కులవృత్తి) అనుకుంట నాయిన జంపిండా.. కష్టపడి నేర్చుకొంటి. మా వొడ్ల పనిల నన్ను మించినోడు లేడని ఊరంత అంటుంటె పొంగిపోతి. సరే.. ఏదో ఓటి నడుస్తుంది గద బాగనే ఉంటదనుకొంటె, రోజురోజుకు వొడ్లోళ్లంత ఊరిడిసిపెట్టి పొయ్యే గడియలు రావట్టె. పదేండ్ల కింద ఈ కాలమొచ్చిందంటె తినేతందుకు తీరకుంట పనుండేది. నాయిన, చిన్నాయిన, నేను ముగ్గరం చేసినా మా వొటా పని దంగేది కాదు. వానాకాల మయిపోయినాంక బండ్లు జేయించుకొనేటోల్లుం డిరి. పెద్దపీటలు, మంచాలు జేయించుకుందురు. సంగడి గిట్ట పట్టి సవారి కచ్చరానికి రెండు బండి గీరలు జెయ్యాల్నంటె మూన్నెల్లు పట్టేది. ఇప్పుడా సంగడి గీరలు పోయినయి. సవారి కచ్చరాలు పోయినయి. అసలు బండ్లు జెయించెటోల్లేరి.. ఎక్కెటోల్లేరి.. మరీ ఈ రెండేండ్లనుంచేతై ఊరికి బస్సులు సర్వీసులు గిరగిరా తిరగవట్టె. కచ్చరాలు మొత్తం మూలకు వన్నయి. ప్యాటకు బాడిగెవొయ్యెచ్చేతందుకు పెద్దబండ్లు నడిసేటియి. ఇగో నెరీ గీ యాడాది నుంచి ట్రాక్టర్లొచ్చినయా మొత్తం బంద్. బండ్లు కొట్టెటోల్లు ఎడ్లమ్ముకోని ప్యాట్ల హమాలి పని జేసుకుంటుండ్రు. యాడాది కింద ఒక్క ట్రాక్టరుండె మనూర్లె. ఇప్పుడు ఆరయినయి. గింతంతూరికి అరయితే ఇంగేముంది? నాగండ్లు సుత మూలకువడ్డయి. లేనోనికి లేకనేపాయె భూమి. ఉన్నోడు ట్రాక్టరే గొనె. రెండు మూడెకరాలున్నోల్లు పైసలిచ్చుడు, దున్నిచ్చుకొనుడు-గిట్లయిపోయి మా మొఖం జూసెటోడే లేడు. పెండ్లి పెండ్లీ అనె. పెండ్లి కాంగనే యాడాదికి నా సావు నన్ను సావుమని ముసలోడు పాయె. అమ్మకు పానం ఎప్పుడు బాగుండది. పెండ్లామాయె-ఇద్దరు పిల్లలయిరి-ఏడ జావాలె.. ఎంతయినా ఊరిడిసి పెట్టినోళ్లె బాగయింద్రు. వాళ్లే అదృష్టవంతులు." అని నారాయణ బాడిసె, ఉలీ దగ్గరేస్తూ దీర్ఘంగా నిట్టూర్చాడు.

**పని జెత్తామన్నా పని లేకుంటయి పోయింది. నా బతుకు దండుగయిపోయింది. నీ లెక్క సదువుకుంటెంత మంచిగుండేది**

నిజానికి రాజిరెడ్డి వయసే అయినా నారాయణ పదేళ్లు ఎక్కువ వయసున్నట్లు అనిపిస్తాడు. ముఖం అప్పుడే ముడుతలు పడుతున్నది. బనీను మీద చిల్లులు తన భవిష్యత్తుతో పరిహాసమాడ్తున్నట్లున్నాయి. "మరి-నువ్ గూడ సిద్దిపేట్ల ఏదన్న పని జేసుకోపాయినవు.. మస్తు పని దొరుకుతద్ద.."లుంగీ పైకి మడుచుకుంటూ రాయి మీద కూచుని సలహా ఇచ్చాడు రాజిరెడ్డి.

"నేను సుత గదే అనుకుంటున్న.. దుద్దెల్ల సామిల్‌కు కొద్దిరోజులు వోయిన. పలం లేదు. యాన్నన్న నీ ఎర్కలింత ప్యూన్ నౌకరుంటె ఇప్పియరాదు.."

**పెండ్లి పెండ్లీ అనె. పెండ్లి కాంగనే యాడాదికి నా సావు నన్ను సావుమని ముసలోడు పాయె.**

"ఇంత మంచి పనోనివి నారాయణా- నువ్వు గట్లంటె ఎట్ల. నేను పదోదిలున్నప్పుడు నువ్వు ఎంత మంచి బొమ్మల జేసిత్తువు. బొంగరాలు జేత్తువు. తలుపుల మీద చేరెల్ల మీద దర్వాజాలకు దేవుండ్ల బొమ్మలు, పువ్వుల బొమ్మలు ఎంత మంచిగ తయారు జేత్తువు. నాకంత గుర్తుంది. బొమ్మలు జేసుకొని అమ్ముకున్నా బత కొచ్చు. మంచి కళ ఒది నీ దగ్గర. ప్యాటకు రా, చూద్దాం, ప్యూనేం జేస్తవు.."

కొంతసేపయిన తర్వాత బస్సు టైమయితుందని రాజిరెడ్డి లేచొచ్చాడు. ఇంట్లో చెప్పి తయారై సిద్దిపేట వొచ్చేశాడు. తన ఉద్యోగం, తన కుటుంబం వగైరాల్లో మునిగి రాజిరెడ్డి ఊరివైపు చూడలేదు. మూడు నెలల తర్వాత నారాయణ సిద్దిపేట వొచ్చి రాజిరెడ్డిని కలిశాడు. రాజిరెడ్డి ఎవర్నో పట్టుకుని ప్రయత్నం చేసి పేరున్న కార్పెంటర్స్ 'రాము బ్రదర్స్ & కార్పెంటర్ వర్క్స్'లో చేర్పించాడు. పనిలో చేరాక నారాయణ అప్పుడప్పుడు కలిసేవాడు. ప్లైవుడ్, డెకొలామ్ వర్కంతా నేర్చాడట. ఖరవాలేకుండా నడుస్తుందన్నాడు. ఫ్యామిలీ తీసుకొచ్చానని కూడా చెప్పాడు.

అనుకోకుండా రాము ఓసారి కలిసి రాజిరెడ్డికి థాంక్స్ చెప్పాడు. "మీ నారాయణ మంచి పనోడు సార్. సిన్సియర్, కష్టపడి పని చేస్తడు. మనిషి కూడా మంచోడు సార్", అని సర్టిఫికెట్టిచ్చాడు.

ఆ మధ్య కొంతకాలం ఏవో కారణాల వల్ల రాజిరెడ్డి, నారాయణ కలుసుకోలేకపోయారు. ఒకటిరెండు సార్లు నారాయణ రాజిరెడ్డి ఇంటికి వొచ్చివెళ్లాడు కానీ, రాజిరెడ్డి ఇంట్లో దొరకలేదు. నారాయణకు పని తీరటం లేదు.

ఉన్నట్టుండి ఓరోజు రాత్రి పదిగంటలకు బజర్ నొక్కితే రాజిరెడ్డి తలుపుతీసి చూసేసరికి ఎదురుగా నారాయణ. చీకట్లో నిలుచున్నాడు. ముఖమంతా పీక్కుపోయింది. ఎక్కడెక్కడో తిరిగి బాగా అలసిపోయినట్టు న్నాడు. లోనికి రమ్మని పిలిచాడు రాజిరెడ్డి. కూచోబెట్టి మంచినీళ్లు తెప్పించితే తాగి కొంచెం కుదుటపడ్డాడు. అప్పుడడిగాడు రాజిరెడ్డి. "ఏంటి విషయం". అని.

నారాయణ చెప్పుకుపోతున్నాడు.

అక్కడ పని మానేశాడట. రోజూ పన్నెండు గంటలు పని చేయించుకొని నాలుగు వందలే ఇస్తున్నాడట. క్షణం తెరిపి లేకుండా, మిగతా వర్కర్ల మాటలు లెక్క చేయకుండా గొడ్డుచాకిరి చేశాడట. ఈ ఆర్నెల్లలో యజమాని నలభైవేలపైనే సంపాయించాడట. ఇంట్లో ఖర్చులు పెరిగిపోయి వొచ్చేది సరిపోక మిగతా ఆరుగురు వర్కర్లతో కలిసి డబ్బు పెంచమని అడిగారట. అంతే, అందరినీ ఏమనలేదట కానీ, వాళ్లతో కలిసినందుకు తనని తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టాడట. మాటకు మాటంటున్నానని అడుక్కు తినేటోడికి ఇంత పొగరుండొద్దని అన్నాడట. ఆత్మను చంపుకోలేక, అవసరం తీరక పని మానేశానని చెప్పాడు.

రాజిరెడ్డికి కడుపులో దేవినట్లయింది. "నారాయణా, నువ్వంటే రాముకి మంచి అభిప్రాయమే ఉందిగదా," అన్నాడు.

"అవు.. అందరితోని నేను మంచోన్ననే చెపుతడు. నాతోని గూడా అంటడు పని మందమే. పడున్నంత కాలం మంచోన్నే. ఎవల్ని సాదలేని మంచితనమెందుకు? నోరు దెరిసి అడిగితెనే గద.. సెడ్డోన్నయిన. ఊళ్లె ఉపాసముండొచ్చుగని. ఇజ్జత్ దీస్కోని బత్కలే.." నారాయణ కోపంగానే అన్నాడు.

కార్పెంటర్ వర్క్స్ చిన్న లెవల్లో పెట్టాలన్నా పదివేలైనా కావాలని- అంత డబ్బు కష్టమనీ- అప్పుజేసి పెట్టినా మిత్తీలతోని సావైతదని. ఈ పోటీల సరిగ నడవకపోతే అది పెద్ద రిస్కవుతుందని చెప్పుకొచ్చాడు. స్వంతంగా బొమ్మలేవో చెక్కి అమ్ముతాననీ. అందుకని ఓ వెయ్యి రూపాయల వరకు సాయం కావాలని నారాయణ రాజిరెడ్డి నడిగాడు.

రాజిరెడ్డికి కూడా నారాయణ ఆలోచన కరెక్టేననిపించింది. మరునాడు వెయ్యి రూపాయలు ఇచ్చి ధైర్యం చెప్పి పంపించాడు.

నారాయణ కొత్త పని ముందటేసుకోవటం వల్ల మళ్లా నెలవరకు రాజిరెడ్డిని కలవటానికి వీలు కలగలేదు. ఈలోపల రాజిరెడ్డికి బదిలీ వచ్చింది మెదక్కి. వెళ్లేప్పుడు నారాయణ ఎంతో బాధపడ్డాడు. కొద్దిరోజుల్లోనే రాజిరెడ్డి మెదక్‌లో సెటిలయి ఫ్యామిలీ తరలించటం వల్ల సిద్దిపేట వెళ్లటానికి కుదరలేదు.

కాలేజీలో ఓరోజు పేపర్ చూస్తుంటే నారాయణ తయారుచేసిన ఒక బొమ్మకు కళా అకాడమీ వాళ్లు ఏదో బహుమతి ఇచ్చినట్లు వార్తుంది. రాజిరెడ్డి తనకే బహుమతి వొచ్చినంతగా సంతోషపడ్డాడు. సిద్దిపేటకు వెళ్లి నారాయణను కలిసొద్దామని బయల్దేరి వచ్చాడు.

నారాయణ పొద్దంతా ఇంటికి రాలేదట. రెండుసార్లు వెళ్లాడు రాజిరెడ్డి. కుటుంబం పరిస్థితి అంతంతగానే ఉన్నట్లు అర్థమైంది. నారాయణ సాయంత్రం బస్టాండ్‌లో బొమ్మలు పట్టుకొని కనిపించాడు. నారాయణ ముఖంలో ఏమాత్రం ఉత్సాహం లేదు. దగ్గరికి వెళ్లి పలకరించాడు.

"బొమ్మలు బాగున్నాయంటున్నారుగానీ కొనేవాళ్లు లేరు. కొంతమంది సేట్ల దగ్గరికి వెళ్లి అడిగినాగని పెద్ద ఫలితం లేకుంటయింది. ఎవరో ఒక సారు చూసి ఆ పోటీలల్ల పెట్టించి నూటపదారు రూపాయలిప్పిచ్చిండు. వాటితోనె ఇల్లు గడుస్తంది. వీళ్ల నెట్ల సాదాల్నో అర్థమయిత లేదు. నువ్వున్నప్పుడు కనీసం కష్టం. సుఖం జెప్పుకొనేతందుకన్న ఉండేది. ఊళ్లె అయ్యో పాపమనేటోళ్లన్నా ఉండిరి."

నారాయణ చాలా బాధపడ్డాడు. రాజిరెడ్డికి ఎట్లా ఓదార్చాలో, ధైర్యం చెప్పాలో తెలియలేదు. తను చిన్నప్పుడూ ఇప్పుడూ ఎంతో ఇష్టపడే బొమ్మలు- చెక్కటానికి ఎంతో కష్టమయినా చూడటానికి చాలా బాగుంటాయి. అందర్నీ ఆకర్షిస్తాయనుకున్నారు. ఇద్దరి అంచనాలు తలకిందులయ్యాయి. మెదక్ బస్సు రాగానే ఏవో మాటలు జెప్పి రాజిరెడ్డి తిరిగొచ్చేశాడు.

దూరంగా ఉండటం వల్ల కొంతకాలం రాజిరెడ్డికి నారాయణ సంగతులేవీ తెలియలేదు. కనబడ్డ ఒకరిద్దర్ని అడిగినా సరైన సమాచారం చెప్పలేకపోయారు.

వేసవి సెలవులకు రాజిరెడ్డి వాళ్ల ఊరికి వెళితే నారాయణ గురించి తెలిసింది. బతుకుసాగని పరిస్థితిలో ఎక్కడెక్కడో పనికోసం ప్రయత్నించాడట. అప్పులు చేశాడట. సిద్దిపేట కూడా విడిచి వెళ్లిపోయాడట.

"మంచోడు నారాయణ. ఊరిడిసిపెట్టి అందరు బాగుపడితే వీడగాధమై పోయిండు." అన్నాడు రాజిరెడ్డి తండ్రి.

సెలవుల్లో రాజిరెడ్డి పిల్లల్తో ఊర్లోనే ఉన్నాడు. వారం తర్వాత తన కొలీగ్ కొడుకు పెళ్ళికని రాజిరెడ్డి హైదరాబాద్ వెళ్లాల్సి వచ్చింది.

సికింద్రాబాద్ కింగ్స్‌వేలో దిగి అడిగితే రిక్షా బేరం కుదరలేదు. ఆటో అతను అటువైపు రానన్నాడు. వెనక్కి నడుచుకుంటూ వెళ్లి మార్కెట్ రోడ్డువైపు మరలాడు రాజిరెడ్డి. వాహనాలు, జనం వేగంగా వెళుతుంటే తప్పుకుంటూ గబగబా వెళుతున్నాడు. పెళ్లి సమయం దగ్గర పడినట్లుంది.

"రెడ్డీ.. రెడ్డీ... "పిలిచి నట్లు వినిపించినా తనని కాదని పట్టించు కోలేదు. మళ్లా చప్పట్లు కొట్టి, "రాజిరెడ్డీ..." అని పిలిచేసరికి రాజిరెడ్డి ఆగి చూశాడు.

కుడిపక్కన ఫుట్‌పాత్ మీద నారాయణ.

దగ్గరికెళ్లాడు. నారాయణ ముందు చూసి ఎగాదిగా పరీక్షిస్తూ అడిగాడు రాజిరెడ్డి.

''ఎట్లున్నవ్.. ఏడుంటున్నవ్.. ఏం సంగతుల్నారాయణా..ఎవర్కి చెప్పకుంటనే వొచ్చేసినవ్.."

"బాగనే ఉన్నా. ఈన్నే ఉంటన్న. ఆదుండలేక ఈడికొచ్చిన. ఇగో ఈ బిజినెస్ పెట్టుకున్నప్పట్నుంచి నా మందం, నా పిల్లల మందం బాగనే నడుస్తంది."

ఫుట్‌పాత్ మీంచి వెళుతున్న ఓ సూట్ వేసుకున్నాయన ఆగి, ''ఏమయ్యా.. ఎంత కొకటి'' అనడిగాడు.

"ముప్పయ్"

**వీళ్ల నెట్ల సాదాల్నో అర్థమయిత లేదు. నువ్వున్నప్పుడు కనీసం కష్టం. సుఖం జెప్పుకొనేతందుకన్న ఉండేది.**

నారాయణతో బేరమాడి ఇరవై ఐదు రూపాయలిచ్చి ఒకటి తీసుకొని వెళ్లి పోయాడాయన.

"గిరాకీ బాగనే ఉన్నట్లుంది.."

రాజిరెడ్డి మాటలు విని, "నీ వెయ్యి రూపాయలు గూడా జమచేసి పెట్టిన. ఇట్ల బతుకుతున్నమంటే ఇదిగో.. ఇదే దిక్కయింది. ఫుట్‌పాత్ షాపు."

రాజిరెడ్డి మరోసారి నారాయణను ఎగాదిగా చూసి కిందికి చూశాడు. ఒక పెట్టె. పెద్ద మీద కాగితం. దానిమీద ఆకర్షణీ యంగా అమర్చి ఉన్నాయి. ఇరవై, ముప్పైపైన్నే ఉన్నాయి క్రికెట్ బ్యాట్లు. అందంగా చెక్కి బంగారురంగులో నున్నగా మెరుస్తున్నాయి. ''వదిహేన్రోజులు తయారుజేస్తా. పదిహేన్రోజులమ్ముతా. కులకశ్పి ఇట్లా పనికొచ్చింది.."నారాయణ ముఖంలో నగర యాంత్రికత చూసి రాజిరెడ్డి కుదుటపడి, ఫంక్షన్ హాలువైపు కదిలాడు. ●

కొత్త శీర్షిక

సమస్యలన్నీ యధాతథమే.
కొత్త సమస్యలు ఎన్నో వచ్చినా
పాతవన్నీ పరిష్కారం కానివే.
ఎన్నో సంఘటనల
యదార్థ వ్యదార్థ
జీవన సారాంశమే కథా కథనాలు.
పాత కొత్తల
మేలు కలయిక కథలసారం.
సరికాని పాత చిక్కులు
విడిపోని గతం ముడులు
నాటి సమాజ స్థితిగతులు
నేటికీ మారని వైనాన్ని తెలుసుకొనే
మహత్తర కథల పరంపర

### కథల వంతెన
(నాటి తరంవారి కథలు నేటి తరానికి)
ఈ శీర్షికకు ఆలోచింపజేసి చైతన్యపరిచే 25 ఏళ్ళ క్రితం రాసిన కథలకు ఆహ్వానం
-సంపాదకులు

బంజారా నానీలు

భయంతో చీకటి
కొండ చాటున దాక్కుంది
చెట్లలోంచి
పొద్దు తొంగి చూస్తోంది.





-డా|| సూర్యాధనంజయ్
సెల్:9849104187

## సునందామృతం

### ఘట్ట కుటీ ప్రభాత న్యాయము

ఘట్టం అంటే రేవు తీరము, ప్రదేశము. తీర్థము అని అర్థం. కుటీ అంటే గుడిసె లేదా పాక. ప్రభాతము అంటే ప్రాతః కాలం, ఉషఃకాలము.

ఘట్ట కుటీ తీరము లేదా ఆ ప్రదేశంలో వేసిన గుడిసె లేదా పాక.

మరి ఆ పాక లేదా గుడిసెకు అంత ప్రాధాన్యత ఎందుకు అంటే పూర్వ కాలంలో రాజుల నగరాలు కోటల మధ్యలో ఉండేవి. వాటికి పెద్ద పెద్ద సింహద్వారాలు ఉండేవి.మనం గోల్కొండ కోట గురించి చదివితే లోపలికి వెళ్ళడానికి ఎనిమిది ద్వారాలు ఉండేవని. అలా వాటి నుండి మాత్రమే నగరంలోకి వెళ్ళాలనీ రాకపోకలు సాగించే వారని తెలుస్తుంది.×

అక్కడ బయటి వారు లోపలికి వెళ్ళడానికి పన్నులు వసూలు చేసే వాళ్ళు, లేదా అధికారులు ఓ గుడిసె వేసుకొని అక్కడ ఉండేవారు.

లోపలికి ప్రవేశించే సమయంలో పాక దగ్గర తప్పకుండా పన్ను కట్టవలసి ఉండేది.

వర్తకుల బండ్లను, సామాన్య ప్రజలను ఆపి పన్ను వసూలు చేయడం జరుగుతూ ఉండేది.పూర్వకాలంలో ఇలాంటి అధునాతన టోల్ గేట్ సదుపాయాలు లేవు కదా!.

అయితే ఓ వ్యాపారికి ఇలా పన్ను కట్టడం ఇష్టం లేదు. దానినెలాగైనా తప్పించుకోవాలని రాత్రి పూట ప్రయాణం చేస్తాడు.అక్కడ బండి ఘాటీ లేదా ఘట్ట కుటీ దగ్గర నుండి వెళితే పన్ను కట్టవలసి వస్తుందని అర్ధ రాత్రి వేళ వేరే దారిలో వెళ్ళేందుకు ప్రయత్నిస్తాడు.ఆ ప్రయత్నంలో సందులు గొందులు తిరుగుతాడు. దారి తప్పి దురదృష్టం కొద్దీ చివరికి ఆ ఘాటీ దగ్గరకే వస్తాడు.అలా వచ్చే టప్పటికి తెల్లవారుతుంది.అంటే ప్రభాతం అవుతుంది.

దీని వల్ల అతనికి అనవసర శ్రమతో పాటు పన్ను కూడా కట్టక తప్పలేదు.

ముందే నేరుగా అక్కడ నుండి వెళ్తూ పన్ను కడితే బాగుండేది. పన్ను నుండి తప్పించుకోవడానికి చేసిన విశ్వప్రయత్నం వృధా అయ్యింది కదా!.

దీనినే తెలుగులో "లోభికి ఇమ్మడి ఖర్చు" అని కూడా అంటారు.దీనికి సంబంధించిన ఓ కథ మనందరికీ తెలిసిందే.

ధనయ్య అనే నేతి వ్యాపారి ఉండేవాడు. అతడు పరమ లోభి.వట్టి ఆశపోతు.పైసలు బాగా కూడబెట్టాలనే ఆశతో కల్తీ నెయ్యి అమ్మేవాడు.

ఒకసారి ఆ ఊరిలోని ఓ పెద్ద మనిషి తమ ఇంట్లో పెళ్లి కోసం ధనయ్య దగ్గర నెయ్యి కొన్నాడు.ఆ నెయ్యితో చేసిన పిండి వంటలు తిన్న చుట్టాలందరికీ వాంతులు అయ్యాయి. దీనికి కారణం ధనయ్య సరఫరా చేసిన కల్తీ నెయ్యి అని తెలుస్తుంది.

వెంటనే ఆ పెద్ద మనిషి వంచాయతీ పెట్టిస్తాడు.ధనయ్య నేతిని కల్తీ చేశాడని ఋజువు అవుతుంది.ధనయ్య చేసిన తప్పుకు గ్రామాధికారి శిక్ష విధిస్తాడు.×

వెయ్యి వరహాలు జరిమానా కట్టమంటాడు. అంత డబ్బు కట్టలేను మరేదైనా శిక్ష వేయండి అంటాడు సరే.'వంద కొరడా దెబ్బలు తినాలి' అంటారు.'అన్ని దెబ్బలు తినలేను మరేదైనా శిక్ష వేయండి' అంటాడు. 'మణుగు నెయ్యి తాగమని' చెబుతారు.చివరి దానికి ధనయ్య ఆనందంగా ఒప్పుకుంటాడు.

కొంచెం నెయ్యి తాగేసరికి కడుపులో ఎలాగో అయిపోయి,దెబ్బలే నయం అనుకుని కొరడా దెబ్బలు తినడానికి ముందుకు వస్తాడు.

అందులో నగం దెబ్బలు తినేసరికి ఒళ్ళంతా వాతలు నొప్పులు.ఆ దెబ్బలు భరించలేక లబలబలాడుతూ వెయ్యి వరహాలు జరిమానా కట్టి ఏడ్చుకుంటూ వెళతాడు.

ముందే తప్పు చేయకుండా ఉంటే బాగుండేది.చేసిన తప్పు ఒప్పుకుని జరిమానా కడితే ఇన్ని రకాలుగా బాధలు ఉండేవి కాదు కదా!.ఇలాంటి వారికి సంబంధించినదే ఈ ఘట్ట కుటీ ప్రభాత న్యాయం.

ఇలాంటి మనస్తత్వం కలిగిన వ్యక్తులు మనకు నిత్య జీవితంలో అక్కడక్కడా కనబడుతూ ఉంటారు. అలాంటి వారిని చూసినప్పుడు ఇలాంటి న్యాయాలు. లోకోక్తులు గుర్తుకు వస్తాయి.



-పురిమళ్ల సునంద
9441815722





*రాసే ఆసక్తి కలవారు సప్తపదులు వాట్సప్ గ్రూప్‌లో చేరి అక్కడ నియమాలు తెలుసుకుని గ్రూప్‌లో రాయండి.రోజూ అక్కడ వందలాదిగా వచ్చేవాటి నుంచి ప్రతివారం ఎన్నికయిన 25 సప్తపదులు "నేటినిజం"లో ప్రచురితం కాగలవు.*

పిలవాలి
కలవాలి
ఆత్మీయుల సమ్మేళనం చెరగని జ్ఞాపికగా నిలవాలి
-కాదంబరి శ్రీనివాసరావు తిమ్మాపురం

భోగిమంటలు
పిండివంటలు
సంక్రాంతికి కనిపించాయి పొలంనుండి
వచ్చిన క్రొత్తపంటలు
-డా|| షహనాజ్ బతుల్ హైదరాబాద్

ఉత్తరాయనం
దక్షిణాయనం
ప్రకృతి గమనరీతిని నిర్దుష్టంగా తెలిపే సౌరయానం.
-పట్నాల ఈశ్వరరావు -విజయనగరం

అగ్రజుడు
అనుజుడు
తండ్రి మనసు గాయపరచని వాడే ఆత్మజుడు
-బిక్కునూరి రాజేశ్వర్-నిర్మల్

అరిగిపోదు
తరిగిపోదు
గురువులు నేర్పే జ్ఞానసంపద ఎన్నటికీ కరిగిపోదు!
-జి.వి.సూర్యనారాయణ-హైదరాబాదు.

మందిరం
సుందరం
భారతీయులం కలిసి రాముడిని పూజిద్దాం అందరం
-కళ్ళే వెంకటేశ్వర శాస్త్రి, బెంగళూరు

అన్నది
విన్నది
రామమందిర ప్రతిష్ట అయోధ్యలో ఇక జరుగనున్నది.
-యడవల్లి విజయలక్ష్మి, రాజమండ్రి.

కేళిక
ప్రహేళిక
అఖండ విజయరహస్యం వేసిన సొష్టవ ప్రణాళిక
-డా.కపిల లక్ష్మణరావు, పెంట్లం

ఫెళ్ళు
ఝల్లు
విరిగె విల్లు, జానకిరాముల కలయికయే హరివిల్లు
-ఉమాదేవి పోచంపల్లి గోపరాజు,అమెరికా

చాటు
మాటు
విశృంఖలమైన శృంగారం ఎప్పుడైనా ఎక్కడైనా చేటు!
- ఎన్ ఆర్ తపస్వి, చెన్నై-23

వారధి
నీరధి
లంకజేర వలసిన నిర్మాణంలో నీలుడు సారధి
-ఐ. చెన్నకేశవులు, కర్నూలు

సరంగం
తరంగం
అలుపెరగక గమ్యం చేరుటయే వాటి అంతరంగం
-అర్చన కోవూరు

కరిగిపోదు..
తరిగిపోదు..
తీపిగురుతుల బాల్యం ఎదలో
ఏనాటికీ చెరిగిపోదు !
-పేరిశెట్టి బాబు, భద్రాచలం

చిక్కు
దిక్కు
కష్టాల్లోనే మనిషి దైవంపై సారిస్తాడు దృక్కు
-పి.కె.దుర్గాప్రసాద్ -విశాఖపట్టణం

ఆవిష్కరణ
బహిష్కరణ
మూఢనమ్మకాలను త్రోసిరాజని సంఘంలో
రావాలి సంస్కరణ
-కామేశ్వరి వాడ్రేవు-హైదరాబాదు

రాజులు,
రోజులు,
గతం ఎప్పుడూ నిన్న పూసిన జాజులు.
-వేము విజయ్ కుమార్, నెల్లూరు జిల్లా

తీరేది
దారేది
మూలాలు మర్చిపోతున్న మనిషి నైజం పేరేది
-ఆకెళ్ళ సూర్యనారాయణ మూర్తి, హైదరాబాద్

రాజ్యము
భోజ్యము
నలుగురికీ కడుపు నిండేలా సాయపడితే పూజ్యము.
-సింహాద్రి వాణి-విజయవాడ

క్లిష్టం
కష్టం
విజయసాధనకు ప్రణాళిక వేసుకుంటే మార్గం స్పష్టం
-కట్ల ప్రతిభారాణి-కార్వేటినగరంచిత్తూరు.

వ్యాసం
న్యాసం
భోగార్ధం నుండి యోగార్ధ ప్రయాణమే సన్యాసం.
-వి యస్ శాస్త్రి ఆకెళ్ల, విజయనగరం.

గతము
సంగతము
ప్రస్తుతములో జీవింతము,
అనాగతమునకు పల్కెదము స్వాగతము
-తెన్నేటి శ్యామకృష్ణ, హైదరాబాదు

చక్కన
చిక్కన
నాటకీయతను, సంభాషణాశైలినీ
ఆవిష్కరించటంలోమేటి తిక్కన
-ఐ. వరలక్ష్మిదేవి, కర్నూలు

కందుకూరి
కాళ్ళకూరి
సామాజిక రుగ్మతలపై రచనలు
చేసారు మంచికోరి!
-యన్.కే. నాగేశ్వరరావు. పెనుగొండ.

శలభం
సులభం
లక్ష్యం భ్రాంతి అయితే విజయం దుర్లభం!
-డాక్టర్ గన్నోజు శ్రీనివాసాచార్య

మనోభావం
స్థలాభావం
పత్రికలో వేయడానికి కుదించి వ్రాయొచ్చు
అదేభావం!
-ఎం. వి. ఉమాదేవి

## చలి మంటపం . . .

తెల్లారక ముందే మసుకు మసుకున
తాత చలికి బుగులు పడక రాజు లెక్క లేసి
ఎండు పుల్లల తోటి అగ్గిని రాజేస్తున్నడు
పల్లెరాగం ఎత్తుకుంటూ !

ఇగ అందరిల నిద్ర యాడుంటది
దుప్పటి దుల్పి లేసుడే
నిద్ర మబ్బువోవుడే
చూస్తుండగనే గూడెం అంతా చలిమంట కాడ ఏకం

తాత ఏం చెప్తడో అందరికీ ఇనాలని ఉంటది
తాత తెలంగాణ వీరుల గాథలు
యాక్షన్ చేసుకుంటా యోధుడి లెక్క సెపుతున్నడు
సొంత రాష్ట్రంకోసం పాణం పై తీపి
విడిచి ఉపాసమున్నరని పిడికిలి పట్టి
గట్టిగా కంఠమెత్తి ప్రతిధ్వనిస్తున్నడు !
అయుసు పోరగాల్లు ఆయువు తీరక ముందే
ఆత్మల అర్పించుకున్నరని ఆర్తిగా అంటున్నడు
త్యాగం చేసిన ఇక్కడోల్లదే ఈ తెలంగాణ
దూరదేశపోల్లది కాదంటున్నడు !

చలి మంట లెక్కనే తాత మాటలు దగడు దగడు

ఇంకేమిడిది
ఆలస్యం లేదు
పోరగల్లు లేచి చలిమంట చుట్టూ
వీరరసంతో డ్యాన్సులు చేస్తున్నరు
చలిమంట కాడ ఎన్నెన్నో నేర్చుకునుడుంటది
చలి మంట ఉత్సవం - చలి మంట ఉత్సాహం
అగ్ని దేవుని ప్రతిష్ఠ చలి మంటపం !

సూర్యుడు ఆగుతడా !
చలిమంటల కాడికి కొండలు కోనలు
మబ్బులు దాటుకుంటూ
కిరణాల మోపులు కట్టుకోని వస్తున్నడు
చలి మంటకు సూర్యుడూ ఇంకా వెచ్చగైతడు

తాత తన ఒక్కడి కోసం కాదు
అందరి కోసం చలిమంట రగిలిస్తాడు
అసలు యజ్ఞం అంటే ఇదే
కొత్త కాంతి సంక్రాంతి అంటే ఇదే



-కందాళై రాఘవాచార్య
8790593638

## ముగ్గంటే..

వాకిట్లో నాలుగు చుక్కలు పెట్టి
రంగులేయడం కాదు ముగ్గంటే
నలుగురు మనుషులను కూడగట్టడం
వాకిళ్లు చిమ్మి కళ్ళాపి చల్లే పనిమనుషుల సందడి
పేడకళ్ళకోసం వీధుల్లో పోటీపడి తిరిగే
అమ్మలక్కలు
రాతి ముగ్గుపిండి రతనాల పిండి మల్లెపువ్వంటి
పిండి
సమయానికి తగుమాటలల్లి
ముగ్గుపిండి అమ్మే వీరయ్య తాత కేకల ప్రతిధ్వని
వీధంతా
ఇంద్రధనుస్సు రంగులను నేలమీదికి దింపి
పొట్లాలు కట్టి రంగులమ్మే రమణమ్మ సృజన
ముగ్గులోన పెట్టే గొబ్బెమ్మ కోసం
పచ్చపచ్చని తంగేడు పూలను గంపకెత్తుకుని
పొద్దుపొద్దునే ఇల్లిల్లు తిరిగే ఈశ్వరమ్మ
ముగ్గు వేసి వేయగానే వాకిట్లోకి వచ్చి
పశువు ఆశీసులు శిశువులకు మంచిదని
గంగిరెద్దులాడించే దంపతుల జంట
పళ్లెంలో గొబ్బెమ్మను పెట్టుకుని
'గొబ్బియల్లో గౌరమ్మ సల్లంగ చూడే
గొబ్బియల్లో గౌరమ్మ మంచి వానలు పడనీయవే
గొబ్బియల్లో గౌరమ్మ సంపదలనీయవే '
గొబ్బి పాటలు పాడుతూ ముంగిళ్ళను
ముత్యాల పందిరిని చేసే ముదితల పాట కచ్చేరీలు
హరిదాసుల కీర్తనలు బుడబుక్కలవాని డబుడక్క
ఢమరుక నాదాలు
పండుగ దానాలు చేయమని గడపగడప తిరిగి
జోలెల్లో బియ్యం, అరిసెలు,
మణుగుపూలు నింపుకుని
గుండె నిండిన ఆనందంతో
పరవశించే అల్పసంతోషులు
ముగ్గు వేయడమంటే జన జాతర
పండుగ అంటేనే పలువురినీ కలిపే వేడుక
ఇచ్చిపుచ్చుకునే వాయనం
సాయమందించే సంప్రదాయం
సరదాలు, సంతోషాలను కలగలిపి
అల్లుకునే అనుబంధాల పూలమాల
పండుగ అంటేపదిమంది కలిసిమెలిసి
పాడుకునే తియ్యనైన పాట



-రోహిణి వంజారి
9000594630



బుడ్డ పర్కులు

ఎంకా! తొడమీద
అగ్గి వద్దది తియ్యర
ముందు నా కాలు
ముల్లు పీకు దొరా!



-అన్నవరం దేవేందర్
9440763479

